ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

సోమవారం 27 జనవరి 2025





జెండా ఆవిష్కరించి గౌరవ వందనం చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరుకు.. మెగా ప్రాజెక్టులు

- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి
- రైలుమార్గాలు, జాతీయ రహదారి నిర్మాణానికి అడుగులు
- గుంటూరు నగరానికి రెండు ఆర్‌వోబీలు మంజూరు
- 399 కిలోమీటర్ల పొడవునా రోడ్ల మరమ్మతులు
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి సందేశం

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెగా ప్రాజెక్టులు మంజూరు చేశాయని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జాతీయ జెండాని ఎగురవేసిన ఆమె ఆ తర్వాత త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పురోగతిపై గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. నల్లపాడు నుంచి బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య రెండో రైలు మార్గం కోసం గుంటూరు జిల్లా పరిధిలో రూ.980 కోట్ల నిధులను రైల్వే శాఖ ఖర్చు చేయనున్నదన్నారు. అమరావతి రాజధానికి రైలు కనెక్టివిటీ కోసం ఎర్రుపాలెం - నంబూరు మధ్య నూతనంగా బ్రాడ్‌గేజ్ రైల్వేట్రాక్‌ని మంజూరైందన్నారు. ఇందుకోసం అవసరమైన 241 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌హెచ్-167ఏజీలో భాగమైన కొండమోడు - పేరేచర్ల మధ్య రహదారిని నాలుగు వరసలుగా విస్తరించేందుకు రూ.270 కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించిన పనులు మార్చి నెల నుంచి ప్రారంభమౌతాయని చెప్పారు. ఎయిమ్స్ మంగళగిరికి రూ.7.7 కోట్లతో తాగునీటి పైపులైను పనులను చేపట్టి పూర్తి చేశామని, దీంతో నిత్యం 2.5 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గుంతల రహిత రహదారులుగా చేసే కార్యక్రమంలో భాగంగా రూ.20.3 కోట్లతో 399 కిలోమీటర్ల పొడవునా మరమ్మతులు చేపట్టి, ఇప్పటివరకు 165 కిలోమీటర్లలో పనులు పూర్తి చేశామన్నారు. గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీని నాలుగు వరసలుగా విస్తరించే పనులు ప్రారంభించామన్నారు. గడ్డిపాడు ఆర్‌వోబీ మంజూరైందన్నారు. విలీన గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు సహకారంతో ప్యాకేజీ-1లో రూ.125.5 కోట్ల, ప్యాకేజీ-2లో రూ.44 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా 24,090 సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా రూ.685 కోట్ల పెట్టుబడితో లక్షా 10 వేల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. 236 యూనిట్లకు రూ.15 కోట్ల రాయితీలను విడుదల చేశామన్నారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.24,502 కోట్లు కాగా సెప్టెంబరుకి రూ.16,855 కోట్లు మంజూరు చేశామన్నారు. గుంటూరు ఛానల్, నల్లా ఆధునికీకరణకు రూ.675 కోట్లు, గుంటూరు ఛానల్ పొడిగింపునకు రూ.274.5 కోట్లు, డెల్టాలోని కాల్వల మరమ్మతులకు రూ.22.3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింద న్నారు. ఏపీఎస్ఐడీసీ ద్వారా 9 నూతన ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు చేస్తున్నామని, వాటి ద్వారా 35,811 ఎకరాలకు సాగునీటిని త్వరలోనే అందిస్తామన్నారు. 131 రైతు సేవా కేంద్రాల ద్వారా 4,260 మంది రైతుల నుంచి 26,682 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.60.5 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఇప్పటివరకు రూ.234 కోట్లను లక్షా 17 వేల మంది రోగులకు రీయింబర్స్ చేశామన్నారు. పీఎంఏవై-2 కింద ఇప్పటివరకు 10,399 మంది లబ్ధిదారులను నమోదు చేశామన్నారు. జిల్లాలో ఏడు స్టాక్‌యార్డుల, 4 రీచ్‌ల ద్వారా ఉచిత ఇసుకని 6.6 లక్షల మెట్రిక్‌టన్నులను సరఫరా చేశామన్నారు.



పోలీస్ పరేడ్ తిలకిస్తున్న కలెక్టర్, ఎస్పీ



విద్యాశాఖ శకటం



అగ్నిమాపక శకటం



స్వాతంత్ర సమరయోధుల కుటుంబానికి ఇంటి పట్టా అందజేస్తున్న కలెక్టర్











విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

ప్రభుత్వ శాఖలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పరేడ్‌గ్రౌండ్‌లో శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతలను ఆకట్టుకున్నాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను కీర్తిస్తూ, దేశభక్తిని చాటేలా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, సెయింట్ లారెల్స్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలవగా వారికి కలెక్టర్ బహుమతులు అందజేశారు. విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ శకటానికి మొదటి బహుమతి, గుంటూరు నగర పాలక సంస్థకు ద్వితీయ బహుమతి, గృహనిర్మాణ సంస్థకు తృతీయ బహుమతి కలెక్టరు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి, సేవా సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలు అందించారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల కుటుంబ సభ్యులను కలెక్టర్ సన్మానించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్టాల్స్ ప్రదర్శనలో వ్యవసాయశాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి-వెలుగు శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖలు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో హెనీ క్రిస్టీనా, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్ కుమార్, జేసీ భార్గవతేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ పవార్ స్వప్నిల్‌జగన్నాథ్, డీఆర్‌వో ఖాజావలి, కలెక్టరేట్ ఏవో మోహనరావు, కార్పొరేషన్ల ఛైర్మన్లు డేగల ప్రభాకర్, మన్నవ మోహనకృష్ణ, పిల్లి మాణిక్యరావు, డిప్యూటీ మేయర్ సజీల, దామచర్ల శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అక్షరమే అండ.. పరిష్కారమే అజెండా

- ప్రజా సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్
- కాలనీల్లో ప్రజా ప్రతినిధుల పర్యటనలు.. సమావేశాలు
- పరిష్కారం కోసం ప్రజలు-అధికారులకు మధ్య వారధి

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అక్షరమే ఆయుధంగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆంధ్రజ్యోతి దినపత్రిక తాజాగా మరో అడుగు ముందుకు వేస్తోంది. ప్రజల గొంతుకగా నిలిచిన ఆంధ్రజ్యోతి 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందడుగు వేస్తోంది. ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉండనున్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలను ఎంపిక చేసుకుని, ఆ ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకుని, వాటిపై ప్రత్యేక కథనాలు ప్రచురించడంతోపాటు, ఆ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చొరవ చూపుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, వినుకొండ, బాపట్ల, మంగళగిరి పట్టణాల్లోని సమస్యలపై అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండా అంటూ ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా ఫోకస్ చేస్తోంది. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాన్య ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా తొలి అడుగుగా గుంటూరు జిల్లాలో గుంటూరులోని శివారు ప్రాంతంలో ఉన్న ఎస్వీఎన్ కాలనీని, పల్నాడు జిల్లాలో వినుకొండ మున్సిపాలిటీ పరిధి శివారులోని గాయత్రీనగర్, లక్ష్మీపురం కాలనీలను ఎంపిక చేసుకుంది. ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఫోకస్ చేసింది. ఆ సమస్యల పరిష్కార విషయమై అందరినీ ఒక వేదిక మీదకు తెచ్చే ప్రయత్నం చేస్తోంది. సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, ఆ సమస్యలు పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు, అధికారులను ఆ వేదికపైకి తీసుకువస్తోంది. ఆ వేదికగా ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు కాలనీల్లో పర్యటించేలా ఆంధ్రజ్యోతి ప్రణాళిక రూపొందించింది. ఈ పర్యటనలో ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లేందుకు ఆంధ్రజ్యోతి అవకాశం కల్పిస్తోంది. ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా ఆంధ్రజ్యోతి ఉండనున్నది.



ఎస్వీఎన్ కాలనీలో రోడ్డు మీదకు పరుచుకున్న చెట్ల కొమ్మలు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

30న ఎస్వీఎన్ కాలనీలో సమావేశం

ఈ నెల 30న సాయంత్రం ఎస్వీఎన్ కాలనీలో సమావేశం నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే మాధవి, కమిషనర్ శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. కాలనీ ప్రజలు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లేందుకు ఇది ఒక మంచి అవకాశం.



బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పవన్ ఆలోచన, చంద్రబాబు విజన్ రాష్ట్రానికి అవసరం

4

- మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన క్రియాశీల సభ్యుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

తవ్వకాలపై.. తేల్చేనా?

- నేటి వరకు ప్రారంభం కాని విచారణ
- వైసీపీ హయాంలో రూ.2 వేల కోట్ల గ్రావెల్ అక్రమాలు
- విచారణకు కూటమి నేతల హామీ.. ఏడు నెలలుగా మౌనం

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అధికారం అండతో గ్రావెల్ దందా విచ్చలవిడిగా సాగింది. రూ.కోట్ల మట్టిని తవ్వి వైసీపీ నేతలు సొమ్ము చేసుకున్నారంటూ నాడు కూటమి నేతలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ చేయించి దోషులను శిక్షిస్తామని చెప్పిన నేతలు ఏడు నెలలుగా మౌనం వహించారు. నాడు విచ్చలవిడిగా సాగిన గ్రావెల్ తవ్వకాలపై నేటి వరకు విచారణ ప్రారంభం కాకపోవడంపై సర్వత్ర నిరసన వ్యక్తమవుతోంది. చేబ్రోలు మండలం శేకూరు, వడ్లమూడి, వేజెండ్ల, వీరనాయకులపాలెం తదితర గ్రామాల్లో నాడు మట్టి మాఫియా చెలరేగిపోయింది. అడ్డగోలు మట్టి తవ్వకాలతో మాఫియా నిర్వాహకులు వేలకోట్ల సంపదను దోపిడీ చేశారు. పట్టా భూముల్లోనే కాకుండా వీరనాయకులపాలెంలో అసైన్డ్ భూముల్లో కూడా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగించారు. మండలం ఎర్ర గ్రావెల్ లభించే గ్రామాలన్నీ అగాధాల్లా మారాయి. మట్టి మాఫియాకు వైసీపీ పాలకులు అండదండలు ఉండడంతో సామాన్యులు చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోయినా అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. అనుమతులు లేకుండా, నిబంధనలు తోసిపుచ్చి వందల అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టారు. తాత్కాలిక అనుమతులతో శేకూరులో 1.81 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు జరిగాయని భూగర్భ శాఖ అంచనాలు వేసింది. నిర్వాహకులకు రూ.1.10 కోట్ల జరిమానా కూడా విధించింది. రెండేళ్లలోనే 3.55 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలించినట్లు గుర్తించారు. రవాణా శాఖ లెక్కల ప్రకారం 2696 వాహనాలపై రూ.4.29 కోట్ల జరిమానాలు విధించినట్లు తెలుస్తోంది. అప్పటి ప్రతిపక్ష నాయకుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మట్టి మాఫియా ఆగడాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినా నాడు ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సరి కాదా తిరిగి ఆయనపైనే కేసులు పెట్టింది. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ నాటి దురాగతాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షిస్తామని ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మట్టి మాఫియాపై విచారణ జరుపుతామని ప్రకటన వెలువడింది. అయితే నేటి వరకు విచారణ ప్రారంభం కాకపోవడంపై ఆయా గ్రామాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చేబ్రోలు మండలంలోని గ్రావెల్ క్వారీలు

మానవాళికి మార్గం చూపిన ఏసుక్రీస్తు

- రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దు
- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్





ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్, హాజరైన భక్తులు

4

సీఆర్‌డీఏలో ప్రతి గురువారం ఓపెన్ ఫోరం

విజయవాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంత పరిధిలో పట్టణ ప్రణాళికా సమస్యల సత్వర పరిష్కారానికి వీలుగా సీఆర్‌డీఏ అధికారులు ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రతి గురువారం మధ్యాహ్నం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ ఓపెన్ ఫోరంలో సీఆర్‌డీఏ ప్రణాళికా విభాగమంతా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. భవన నిర్మాణ అనుమతులు, లే అవుట్ల అనుమతులు, వాటికి సంబంధించిన సమస్యలు, వివాదాలు ఏమైనా ఉంటే వాటిని ఓపెన్ ఫోరం దృష్టికి తీసుకొస్తే అప్పటికప్పుడు పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటారు. లేకపోతే సమయం నిర్ణయించి పరిష్కరిస్తారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని సీఆర్‌డీఏ ప్రాంతాలకు చెందిన వారంతా తమ సమస్యల పరిష్కారానికి ఈ ఓపెన్ ఫోరాన్ని వినియోగించుకోవచ్చని సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఓపెన్ ఫోరాన్ని నిర్వహించారు. అప్పట్లో విస్తృత స్పందన వచ్చింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి ఓపెన్ ఫోరం కార్యక్రమానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. ప్రతి గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సీఆర్‌డీఏ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెప్మాలో అక్రమాలకు యాప్‌తో చెక్

6

- పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు
- బయోమెట్రిక్ ముఖ హాజరు తప్పనిసరి

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

4

నిరంతర అధ్యయనం అవసరం


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్లో వర్క్ షాప్ వైద్య విధానంలో వస్తున్న మార్పులపై నిరంతరం అవగాహన కలిగి ఉండటమే కాకుండా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ అబ్జర్వర్, కారుమూరి హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వడ్లమూడి డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో ఆదివారం ఈసీజీ, హృదయ సంబంధిత వ్యాధులపై వర్క్ షాప్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలతో జిల్లాలోని గ్రామీణ ప్రాంత వైద్యులు, పీజీ విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ జరిగింది. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈసీజీ విధానం ద్వారా హృదయ సంబంధిత వ్యాధులను గుర్తించవచ్చు అన్నారు. ఈసీజీలో వస్తున్న మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈసీజీ విధానం పరిశీలిస్తే గుండెతోపాటు శరీరంలోని రుగ్మతలను ముందే గుర్తించవచ్చని తెలియజేశారు. డీవీసీ హాస్పిటల్ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అత్యాధునిక వసతులు డీవీసీ హాస్పిటల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పూర్ణానంద, ఆయుష్ హాస్పిటల్ కార్డియాక్ విభాగం డాక్టర్ శ్రీనివాస్ చౌదరి, ఎన్ఆర్ఐ హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ జాన్ సతీష్, కార్డియాక్ సీనియర్ వైద్యులు, డాక్టర్ దక్షిణామూర్తి తదితరులు వైద్య విధానంలో వస్తున్న మార్పులను వివరించారు. డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ కరణం నవీన్, డాక్టర్ రామకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వంటమాస్టర్ అనుమానాస్పద మృతి


మృతుడు కరీంబాషా

తెనాలి, మారీసుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో వంటమాస్టర్‌గా పని చేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన మహమ్మద్ కరీంబాషా (29) చెంచుపేటలో ఓ హోటల్‌లో వంటమాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. శనివారం కుటుంబ సభ్యులకు పనికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి రాత్రైనా ఇంటికి తిరిగిరాలేదు. ఉదయం తాను నివసించే కాలనీలో సైడు కాలువలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతినికి మద్యం అలవాటు ఉండటంతో పూటుగా తాగి మద్యం మత్తులో కాలువలో పడి ఉండవచ్చునని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో నిందితులైన బాపట్ల జిల్లా.. బాపట్ల మండలం బెస్తవారిపాలెంకు చెందిన దైవనాయక్ మూర్తికుమార్, ముత్తాయపాలెంకు చెందిన నక్కల నాగార్జునల కు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదంపాల్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులు బాపట్ల జిల్లాకు చెందిన వేరే వ్యక్తులకు చెందిన స్థలాన్ని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నరసరావుపేట సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో సంవత్సరం క్రితం రిజిస్ట్రేషన్ చేశారు. ఒరిజినల్ ఓనర్లు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

మానవాళికి మార్గం చూపిన ఏసుక్రీస్తు

- రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దు
- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్


బైబిల్ మిషన్ మహోత్సవాలకు హాజరైన భక్తులు

పెదకాకాని, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, దయ, జాలి, త్యాగం, క్షమాగుణం వంటి లక్షణాలతో ఎన్నో అద్భుతాలు చేసి సమస్త మానవాళికి మార్గం చూపిన ఏసుక్రీస్తు ప్రభువు శ్రేష్ఠుడని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం కాకాని స్వస్తిశాల సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించారు. అనంతరం జె.శామ్యూల్ కిరణ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రైస్తవ భక్తుల్లో ఆధ్యాత్మికత పెంచేందుకు, నిత్య సంతోషం పొందేందుకు మహోత్సవాలు దోహద పడతాయన్నారు. నాలుగు రోజులు మహోత్సవాల్లో పాల్గొనడం ద్వారా ఆశీర్వాదం, దీవెన, అన్ని అంశాలలో విజయం సాధించడానికి ఒక మార్గంగా భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఆత్మీయ జీవితంలో శ్రేష్ఠమైన అంశాలను ఉదహరించారు. దేవుని మాట వినుట, దేవాలయంలో గడుపుట, ప్రేమ, నీతి, విశ్వాసం కలిగి ఉండటం పరిపూర్ణమైన క్రైస్తవ జీవితానికి అర్థం అన్నారు. రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దుష్ట హృదయం లేకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రార్థన ధూపం దేవునికి ఇష్టమనీ, ప్రతి ఒక్కరూ ప్రేమ సమాధానాలు కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రజలందరూ ఎల్లప్పుడూ దేవుని దయలో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వాదం పలికారు. తొలుత బైబిల్ మిషన్ సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, రాజు, పి.ప్రకాష్ ఓనేసం, సత్య ప్రకాష్, డాక్టర్ డేనియల్ దినకర్ దైవ సందేశాలు అందించారు.

భక్తులతో పోటెత్తిన ప్రాంగణం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ దేశాల నుంచి భక్తులు పాల్గొనడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మహోత్సవాలతోపాటు ఆదివారం దైవారాధన కూడా కావడంతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవున్ని ఆరాధించారు. పెదకాకాని స్వస్తిశాలకు భక్తుల తాకిడి పెరిగింది.

నేటి షెడ్యూల్ ఇలా..

సోమవారం మహోత్సవాల కార్యక్రమంలో తెల్లవారుజామున ధ్యానం, క్రైస్తవ కీర్తనల ఆలాపన, దైవ సందేశాలు ఉంటాయని మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ పేర్కొన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు

విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయా కార్యాలయాల అధిపతులు ఆదివారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం రానున్న కాలంలో వారు సాధించాలనుకున్న లక్ష్యాలను వివరించారు.

ఏఎన్‌యూలో...



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తి పరిడవిల్లాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి అధ్యక్షత వహించారు. ముందుగా ఆచార్య గంగాధరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలు, విధులను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రంగయ్య, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య పి.జాన్సన్, పాలక మండలి సభ్యులు ఆచార్య కె. సుమంత్ కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆచార్య ఎస్.మురళీ మోహన్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ సుబ్బారావు, సీడీసీ డీన్ రవికుమార్, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ జీఎస్టీ కార్యాలయంలో...


ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసిన కమిషనర్ నరసింహారెడ్డి

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జీఎస్టీ ఉద్యోగులు దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం గుంటూరు కన్నావారితోటలోని సీజీఎస్టీ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అంకితభావంతో పనిచేసిన అధికారులకు కమిషనర్ నరసింహారెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత అధికారులు నిర్వహించిన పరేడ్‌లో కమిషనర్ గౌరవ వందనం స్వీకరించారు. నల్లపాడు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జానపదం, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కాసుల కృష్ణంరాజు చేసిన మ్యాజిక్ షో, డ్రాగన్ షో ఉద్యోగులను అలరించాయి.

నల్లపాడు రైల్‌విహార్‌లో...


రైల్ విహార్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని రైల్‌విహార్‌లో గణతంత్ర దినోత్సవంను రైల్వే శాఖ ఘనంగా నిర్వహించింది. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ జాతీయ జెండాని ఎగుర వేసి గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. ప్రయాణికుల సేవలో పునరంకితమౌదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, ఎస్‌సీఆర్ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆశలత పాల్గొన్నారు.

ముద్దాయిలు నేరాన్ని అంగీకరించింది నిజం కాదా..

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


జిమ్ జానీపై దాడి చేసిన వైనాన్ని చూపుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణానికి చెందిన జిమ్ జాని ఇంటిపై దాడి కేసులో ప్రధాన ముద్దాయిలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న సమయంలో, ముద్దాయిలు నేరాన్ని అంగీకరించింది నిజం కాదా అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై బ్రహ్మనాయుడు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమాయకులపై తప్పుడు కేసులు పెట్టి, అట్రాసిటి కేసులు నమోదు చేసి, నేడు చట్టాల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వంలో బొల్లా అండతో కొందరు అల్లరు మూకలు ఆడపిల్లలను అల్లరిచేస్తే వారిపై కనీసం కేసు కూడా పెట్టకుండ వదిలేశారని, హత్యకు గురైన రషీద్, జిలాని ఇద్దరు స్నేహితులని, ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణను ఖండించక పోవడంతో పలు అరాచకాలకు బొల్లానే మూల కారణం అయ్యారని ఆరోపించారు. గతంలో వల్లెం శేషమ్మ బతికుండకానే మృతి చెందినట్లు ధ్రువీకరించారనీ, 70 సంవత్సరాల వృద్ధురాలు లక్ష్మమ్మపై హత్యయత్నం జరిగితే కనీస విచారణ చేయలేదని వివరించారు. మద్దతు ధర అడిగితే రైతును జైలుకు పంపిస్తారా అని నిలదీశారు. క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీల ఆస్తులకు రక్షణ కల్పిస్తాం అన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు కారుచౌకగా క్రిస్టియన్ ప్రాపర్టీని కొనుగోలు చేసి, తర్వాత కంపెనీ పేరు పెట్టుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ సబ్‌జైలులో అరాచక శక్తులను పరామర్శించి బయటకు వచ్చి పోలీసులుపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు.

పవన్ ఆలోచన, చంద్రబాబు విజన్ రాష్ట్రానికి అవసరం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన క్రియాశీల సభ్యుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మంగళగిరి సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ఆలోచనలు, చంద్రబాబు విజన్ ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కులను ఆదివారం మంగళగిరి పట్టణంలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో పంపిణీ చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పంపిన రూ.5 లక్షల చొప్పున చెక్కులను 22 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ విజన్ లేని నాయకుడితో రాష్ట్ర ప్రజలు నష్టపోతారని, అందుకు ఐదేళ్ల వైసీపీ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దురదృష్టకర పరిస్థితుల్లో 928 మంది క్రియాశీల సభ్యుల కుటుంబాలకు బీమా పథకం ద్వారా రూ.24 కోట్ల మేర అందజేశామన్నారు. ప్రభుత్వం లేనప్పుడు కూడా ఆపత్కాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచామని, పవన్ కల్యాణ్ ఎన్నో సందర్భాల్లో తన సొంత నిధుల నుంచి సాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్, జనసేన కార్యక్రమాల నిర్వహణా విభాగం కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, పీఏసీ సభ్యుడు కొన తాతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నేతలు గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, నయూబ్ కమాల్, సయ్యద్ జిలానీ, సుంకర శ్రీనివాస్, సురేష్, కిరణ్ రాయల్, గంజి చిరంజీవి, శివపార్వతి పాల్గొన్నారు.

నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గుంటూరు జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హౌసింగ్ బోర్డు కాలని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న రెండు కిళ్లీ బంకులలో బావ, బావమరుదులైన వెంకటేశ్వర ట్రేడర్స్ నిర్వాహకులు కోట అప్పారావు, కాకుమాను వెంకట వరప్రసాదరావు నకిలీ సిగరెట్‌లు విక్రయిస్తున్నారు. వారి నుంచి 700 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరెట్ల ఖరీదు రూ. 12,900 ఉంటుందని సీఐ వంశీధర్ తెలిపారు. ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

నాట్కో ట్రస్ట్‌కు ప్రత్యేక సేవా అవార్డు


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సదాశివరావు

గుంటూరు (మెడికల్) జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్య, వైద్య రంగాల్లో తమ వంతు సామాజిక సాయం అందిస్తున్న నాట్కో ట్రస్ట్‌కు గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక అవార్డు లభించింది. కొన్నేళ్లుగా నాట్కో ట్రస్ట్ జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలలు, గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రూ.కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేస్తుంది. గుంటూరు జీజీహెచ్‌లో రూ.40 కోట్ల వ్యయంతో నాట్కో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణంతో పాటు శిశు వైద్య విభాగం, డయాలసిస్ వార్డు, మానసిక వైద్య విభాగం సెమినార్ హాల్‌ను అభివృద్ధి చేసింది. త్వరలో రూ.20 కోట్ల వ్యయంతో 150 పడకలతో కూడిన క్యాన్సర్ వార్డును కొత్తగా నిర్మించనుంది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ సేవలను గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం ఆదివారం పోలీసు కవాతు మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి, నాట్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ ఎఫైర్స్) నన్నపనేని సదాశివరావుకు అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నాట్కో కేన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నన్ను కొట్టిన వారిని చూసి వస్తా

- పార్టీ శ్రేణులతో డిప్యూటీ స్పీకర్ రఘురామ


పార్టీ నాయకులు కనపర్తి, చిట్టిబాబు, నాని తదితరులతో రఘురామకృష్ణరాజు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజుపై గతంలో జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితులు గుంటూరు జిల్లా జైలులో ఉండగా వారిని గుర్తించేందుకు ఆదివారం ఆయన ఇక్కడికి వచ్చారు. జిల్లా జైలులో తులసి బాబు ఐడెంటిఫికేషన్ టెస్ట్ పరేడ్‌కు ఆయన హాజరయ్యారు. అప్పట్లో ఆయన వైసీపీ ఎంపీగా ఉన్నప్పటికీ ఆయన్ను అరెస్టు చేసిన సమయంలో జిల్లా కోర్టు వద్దకు, అలాగే జైలు వద్దకు పెద్ద సంఖ్యలో టీడీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావంగా నిలిచారు. నేడు కూడా పలువురు పార్టీ నాయకులు కోర్టు, జైలు వద్దకు వచ్చి ఆయనకు మద్దతుగా నిలిచారు. జైలు వద్ద టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, చిరుమామిళ్ళ నానితో పాటు నాటి వైసీపీ బాధితులు కంచేటి సాయి కుమార్, దండా నాగేంద్ర, దేవరపు గాంధీ, పలువురు పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆనాడు తనపై తప్పుడు కేసు పెట్టి కొట్టి నిర్బంధించింది ఈ జైల్లోనే కదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు తనపై హత్యాయత్నం చేసిన నిందితులు ఈ జైల్లోనే ఉన్నారట చూసి వస్తాను అంటూ పార్టీ శ్రేణులకు చెప్పి లోనికి వెళ్లారు. ఆ తర్వాత జరిగిన మీడియా సమావేశంలోనూ విలేకరులు నాటి పరిస్థితులపై ప్రశ్నించినప్పుడు నాటి చీకటి రోజులను ఎందుకు గుర్తు చేస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశోధనతో కూడిన రచనలు రావాలి

- స్త్రీవాద రచయిత్రి ఓల్గా



సదస్సులో మాట్లాడుతున్న స్త్రీవాద రచయిత్రి పోపూరి అరుణ కుమారి(ఓల్గా), వేదికపై సురేష్‌బాబు, శివప్రసాద్, మోహనరావు

యడ్లపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులపై లోతైన అధ్యయనం, పరిశోధనతో కూడిన రచనలు, నాటకాలు రావాలని ప్రముఖ స్త్రీవాద రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పోపూరి అరుణకుమారి(ఓల్గా) అభిప్రాయం వ్యక్తం చేశారు. యడ్లపాడులో కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం.. స్త్రీవాదంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల మీద జరుగుతున్న లైంగిక దాడులు, మాతృత్వ పోకడలు, శ్రమైకజీవనం వంటి సమస్యలను సృజనాత్మకంగా అధ్యయనం, పరిశోధనలు చేసి రచయితలు రచనలు చేస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట స్త్రీవాద రచనలు ప్రవేశించి నాలుగు దశాబ్దాలు గడిచాయన్నారు. వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు నేపథ్యంగా తమ ప్రయాణం సాగుతుందన్నారు. ప్రారంభసభ అనంతరం ఉదయం 11.30 గంటలకు వివేక సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. వర్తమాన నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన రెండో సమావేశం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

- మరొకరికి గాయాలు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు రోడ్డులోని సుభాని హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మైనర్ మృతి చెందడంతో మరో మైనర్ గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న చౌత్రా సెంటర్‌కు చెందిన రోహిత్ కృష్ణ (17) అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న తరుణ్ గాయపడ్డాడు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాల మేరకు.. చౌత్రా సెంటర్‌కు చెందిన వసంతకు ఆమె భర్తకు మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. వసంత కుమార్తెకు వివాహం కాగ, కుమారుడు రోహిత్ కృష్ణతో కలసి ఉంటోంది. తల్లి ఇళ్లల్లో వంట పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. కుమారుడు రోహిత్ కృష్ణ 8వ తరగతితో చదువు మానేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం తల్లి మోపిదేవి గుడికి వెళ్ళగా, రోహిత్ కృష్ణ, తన స్నేహితుడైన తరుణ్‌తో కలిసి పక్కింటి వారి నుంచి స్కూటీ తీసుకుని నల్లపాడు వైపు వెళ్లారు. సుభాని హోటల్ వద్దకు వెళ్లేసరికి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ద్విచక్ర వాహనాన్ని రోహిత్ కృష్ణ నడుపుతుండగా, తరుణ్ వెనుక కూర్చున్నాడు. ఈ ప్రమాదంలో రోహిత్ కృష్ణ అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న తరుణ్ గాయపడ్డాడు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 555.40 అడుగులు ఉంది. ఇది 221.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7272 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,319 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00


కాలనీలో నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్


సీసీరోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు


సీసీ రోడ్డు మధ్యలో వదిలేసిన విద్యుత్ స్తంభం


ఎస్వీఎన్ కాలనీ ముఖద్వారం


రోడ్డుపైనే డంప్ చేసిన చెత్త


కాలనీలోని మట్టి రోడ్డు

ఎస్వీఎన్ కాలనీలో
సమస్యల తిష్ఠ

గుంటూరు నగర శివారులోని ఎస్‌వీఎన్‌కాలనీ ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే, ఇక్కడ తిష్ఠ వేసిన సమస్యలు మాత్రం కాలనీ వాసులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన రహదారి, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, దోమల బెడదకు తోడు వీధికుక్కల స్వైరవిహారం వంటి పలు సమస్యలు తప్పట్లేదు. సంబంధిత అధికా రులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు కాలనీ వాసులు ఆయా సమస్యలపై ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదు.

- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ
- కనిపించని సైడ్ డ్రైన్లు, నిర్లక్ష్యంగా కల్వర్టులు
- అరకొరగా తాగునీరు.. అపార్ట్‌మెంటు వాసుల కష్టాలు
- వీధి కుక్కల బెడద
- 'ఆంధ్రజ్యోతి'కి సమస్యలు చెప్పిన కాలనీవాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎంతో ప్రసిద్ధి చెందిన, ఎందరో ప్రముఖులను ఆ కాలనీ అందించింది. నగర శివారులో ఉన్నప్పటికీ ఆ కాలనీ గురించి తెలియనివారు ఉండరు. దాని పేరు ఎస్‌వీఎన్ కాలనీ. అందరికీ సుపరిచితమైన ఈ కాలనీ అసలు పేరు శ్రీనివాసనగర్ (ఎస్‌వీఎన్) కాలనీ. ఇక్కడ పాతతరం ఇళ్లతో పాటు ఆకాశాన్ని తాకే అపార్ట్‌మెంట్ల సముదాయం ఉన్నాయి. పల్లె, పట్టణ సమ్మిళిత వాతావరణంతో ఈ కాలనీ ఎంతో ఆహ్లాదకరంగా ఉం టుంది. శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం, పార్కు ఇక్కడ ఉన్నాయి. ఇవన్నీ బాగానే ఉన్నాయి. కానీ, సుదీర్ఘకాలంగా ఈ కాలనీలో తిష్ఠ వేసిన సమస్యలే పెద్ద తల నొప్పిగా మారాయి. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ సమస్యలు మరింత జఠిలంగా మారాయి. గడిచిన ఐదేళ్ల ఈ కాలనీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కూడాల ఏవు. ప్రధానంగా రోడ్లు, మురుగునీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) వ్యవస్థ, కల్వర్టులు.. ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యల జాబితాకు అంతూ పొంతూ లేకుండా పోతుంది. ఈ విషయమై కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి'తో వాపో యారు.

● ప్రధాన రహదారి గుంతలమయం

ఎస్వీఎన్ కాలనీలో ప్రధాన రహదారి సైతం గుంతలమయంగా మారింది. అంతర్గత రహదారుల గురించి చెప్పనే అక్కర్లేదు. కాలనీలోని సీసీ రోడ్లన్నీ శిథిలమైపోయాయి. రోడ్ల మధ్యలో ఉన్న యూజీడీ మ్యాన్ హోల్స్ రోడ్డు మధ్యలో అరడుగు గుంతలా మారిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. అంతర్గత రహదారులపైనే డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతోంది. కనీసం సైడ్ డ్రైన్లు కూడా లేవు. పలుచోట్ల రోడ్ల వేశారే తప్ప డ్రైన్లు మరిచారు. ఎస్వీఎన్ కాలనీని ఆనుకుని ఉన్న వైష్ణవీనగర్ 2, 3 లైన్లలో కనీసం సీసీ రోడ్లు కూడా కరువయ్యాయి. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ మరింత అధ్వానం. వైష్ణవినగర్‌పై నగరపాలక సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది. ఎస్వీఎన్ కాలనీ మెయిన్ సెంటర్‌లోని బస్‌షెల్టర్ అధ్వానంగా ఉంది. నిర్వహణా లోపమే ఇందుకు కారణం. సీసీ రోడ్డుకు అడ్డం వచ్చిన స్తంభాన్ని తొలగించకుండానే రోడ్డు వేశారు. డ్రైనేజీలకు గుంతలు తవ్వి వదిలేశారు. నడి రోడ్డుపైనే చెత్తాచెదారం డంప్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

● తాగునీటి కటకట

ఏ కాలమైనా సరే, ఎస్వీఎన్ కాలనీవాసులకు గొంతెండిపోవాల్సిందే. రెండు రోజులకు ఒక పర్యాయం నగరపాలక సంస్థ నీరు సరఫరా చేస్తోంది. అది కూడా గంట సమయం అని చెప్పి, అరగంట పాటు నీరు రావడం లేదు. శివారు ప్రాంతాలైన వైష్ణవీనగర్, నేతాజీనగర్, బసవతా రకరామానగర్ వంటి అనేక ప్రాంతాల్లోనూ ఇబ్బం దులు తప్పట్లేదు. ఇక, అపార్టుమెంటు వాసుల పరిస్థితి అయితే మరీ అధ్వా నం. ఈ కాలనీలో సుమారు 70కి పైగా అపార్టుమెంట్లు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో తాగునీరు అందకపోతుండటంలో, ట్యాంకర్లపై ఆధార పడాల్సి వస్తోంది. దీంతో, కాలనీవాసుల జేబులు గుల్లవుతున్నాయి.

● దోమల బెడద.. వీధికుక్కలు స్వైరవిహారం

వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇంట్లో నుంచి బయటకు రావా లంటే భయపడిపోయే పరిస్థితి. మహిళలు, చిన్నారులపై వీధికుక్కల దాడి చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో, స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. దోమల నివారణపై దృష్టి సారించాల్సిన అవసరం అధికారులపై ఎంతైనా ఉంది.



కాలనీలో రోడ్లు లేవు


బొర్రా భారతి

మా కాలనీలో రోడ్లు లేవు. ఉన్న రోడ్లు గుం తలుగా మారాయి. నడవాలన్నా, వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉంటోంది. కొన్ని బజార్లలో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉన్నాయి.

తాగునీటి సమస్య


దండా సుబ్బారావు

కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గంట సేపు నీరు వదులుతున్నట్లు కార్పొరేషన్ సిబ్బంది చెప్తున్నారే కానీ మాకు అందడం లేదు. స్తంభాలగరువు నుంచి సరఫరా అవుతున్న నీరు శివారు ప్రాంతానికి అందడంలేదు.

దోమల స్వైరవిహారం


షేక్ అబ్దుల్ సుభానీ, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి

కాలనీలో దోమల బెడద అంతా ఇంతా కాదు. పట్ట పగలే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పారిశుధ్య సమస్య కార ణంగా దోమలు పెరుగు తున్నాయి. దోమల వల్ల ఏ ప్రమాదం వాటిల్లుతుందోనన్న భయం వెంటాడుతోంది.

చెట్ల కొమ్మలతో ఇబ్బందులు


పుటిగంపు సత్యవతి

కాలనీలో చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగి కొమ్మలు రోడ్లపైకి వచ్చేశాయి. రాత్రిళ్ల అంధకారం అలుముకుని తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. చెట్ల కొమ్మల వల్ల వీధి లైట్ల వెలుగు కూడా పడడం లేదు. కొమ్మలు తొలగించాలి.

మెయిన్‌రోడ్డును అభివృద్ధి చేయాలి
వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, కార్పొరేటర్



ఎస్వీఎన్ కాలనీ మెయిన్‌రోడ్డును అభివృద్ధి చేయాలి. రోడ్డంతా గుంతలమయంగా మారి వాహనదారులు, పాదచరులు ఇబ్బందులు పడుతున్నారు. వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఎదుట నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్‌ను అభివృద్ధి పరచాలి. చిన్మయ విద్యా మిషన్‌లో విద్యార్థుల కోసం ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయాలి.

విజ్ఞాన్ విద్యా సంస్థల్లో గణతంత్ర వేడుకలు


మాట్లాడుతన్న వీసీ నాగభూషణ్

గుంటూరు(విద్య),జనవరి26(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ విద్యాసంస్థల్లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం వడ్లమూడిలోని యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ గడిచిన 76 ఏళ్లలో మన దేశం అనేక రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి


విద్యార్థుల నృత్యప్రదర్శన

గుంటూరు(విద్య),జనవరి 26(ఆంధ్రజ్యోతి): త్యాగధనుల ఫలమే స్వాతంత్ర్యమని వారు ఇచ్చిన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భాష్యం మెయిన్ క్యాంపస్‌లో చైర్మన్ రామకృష్ణ మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అదేవిధంగా భాష్యం బ్లూమ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో కాటూరి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ జి. శిల్ప ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. భాష్యం జెడ్‌ఈవోలు, క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

స్వేచ్ఛను సమర్థవంతంగా వినియోగించుకోవాలి


జెండావందనం చేస్తున్న మేకల రవీంద్రబాబు తదితరులు

గుంటూరు(విద్య),జనవరి 26 (ఆంధ్ర జ్యోతి): స్వాతంత్ర్య స్ఫూర్తితో స్వేచ్ఛను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సెయింట్ లారెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి మేకల రవీంద్రబాబు అన్నారు. గణతంత్ర వేడుకలు సందర్భంగా ఆర్టీసీ కాలనీలో పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మేకల శేషుకుమారి, డైరెక్టర్ శ్రీకర్ ఎం లక్ష్మి ఎం ఎల్ భారతి అరుణ ఇందిరా శివ పార్వతి దత్తకుమారి సంతోష్ కుమార్ అంజలి దేవి సీమ అనిత వాసవి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్‌లో..

స్థానిక విజేత ఐఐటీ ఫౌండేషన్ స్కూల్‌లో జాతీయ జెండాను స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ ఆవిష్కరించారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్‌వీఆర్‌జేసీలో..


మాట్లాడుతున్న కొడాలి నాగమల్లేశ్వరరావు

స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధిలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు యువత కృషి చేయాలని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కొడాలి నాగమల్లేశ్వరరావు సూచించారు. స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల కవాతుతో గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తితో గుంటూరు నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు , అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జిన్నాటవర్ సెంటర్, ఎన్‌టీఆర్ మున్సిపల్ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. హిమని సెంటర్‌లోని మహాత్మాగాంధీ, లాడ్జి సెంటర్‌లో ని అంబేద్కర్, జీఎంసీ ప్రధాన కార్యాలయంలో బాబూ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు, విభాగాధిపతులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్‌టీఆర్ స్టేడి యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విధుల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులు, కార్మికులు, సచివాలయ కార్య దర్శులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టీ వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేషన్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జీఎంసీ అధికారులు

జిల్లా పరిషత్ కార్యాలయంలో

గుంటూరు సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ వీ జ్యోతిబసు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డెప్యూటీ సీఈఓ కృష్ణ పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మాధవి

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయలంలో

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సమైక్యత, సౌభ్రాతృత్వానికి 76 ఏళ్ళు వచ్చాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక శ్రీనివాసరావుపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో, జ్యోతిర్మయి అపార్టు మెంట్స్‌లో జెండాను ఆమె ఆవిష్కరించారు.


జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగ

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగ భారత గణతంత్ర దినోత్సవమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. అంజుమన్ ఈ ఇస్లామియా స్కూల్‌లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్టార్ కన్వెన్షన్‌లో తలసీమియా అమరావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో

ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగమే మన స్వేచ్ఛాయుత జీవితం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, మద్దిరాల ఇమ్మానుయేల్, గుంటుపల్లి శేషగిరి రావు, కనుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, షేక్ లాల్ వజీర్, పానకాల వెంకట మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'

గుంటూరు కార్పొరేషన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారతదేశ రాజ్యాంగ పీఠికలో ఉన్న సోషలిస్ట్,లౌకిక పదాలను తొలగించాలని ,మత రాజ్యాంగాన్ని రూపొందించాలని, మతోన్మాదులు భావిస్తున్నారని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆరోపించారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తోపాటు సామాజిక ఉద్యమ కారులతో కలిసి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్వీఎన్ కాలనీ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎస్‌వీఎన్ కాలనీ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్కు అధ్యక్షుడు కేఎస్ పార్థసారధి ఆధ్వర్యంలో డాక్టర్ నిమ్మల శేషయ్య పాల్గొన్నారు.

ల్యాబ్ అండ్ ఎక్స్ రే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గుంటూరు సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని ది గుంటూరు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, అసోసియేషన్ నేత ఆనం సంజీవరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే స్వేచ్ఛా, స్వాతంత్ర్యం: డేగల ప్రభాకర్


వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న ప్రభాకర్

గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మహనీయుడు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే నేడు మనవంతా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నా మని ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మాతృశ్రీ వృద్ధాశ్రమంలో డేగల యూత్ సునీల్, హనీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్య క్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని బీజేపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా తూర్పు నియోజకవర్గంలో జరిగిన కొత్తపేట, చిన్న మహాలక్ష్మి గుడి వద్ద జాతీయ పతాకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలే నేటి స్వేచ్ఛావాయువులని అన్నారు. సురేష్‌కుమార్ జైన్, తల్లం మనోజ్, దేసు సత్యానారాయణ, దేవిశెట్టి బాబురావు, అనిల్,కైలాష్‌జైన్, ప్రవీణ్, వాసు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ..

గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కార్యా లయంలో బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు ఆధ్వర్యంలో, స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, తూర్పు ఇన్‌చార్జ్ షేక్ నూరి ఫాతిమా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు జాతీయ పతా కాన్ని ఆవిష్కరించారు. స్థానిక రాజీవ్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వర రావు పార్టీ నాయకులు, జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో చాంబర్ జిల్లా అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవి ష్కరించారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, చుట్టుగుంట సెంటర్ సమీపంలోని ఏపీ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ ఐదోలైను లోని కార్యాలయంలో, కాకుమానువారి తోట యానాది కాలనీ ట్యూషన్ సెంటర్‌లో, అరండల్‌పేటలోని అవ గాహన సంస్థ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

బాపూజీ స్కూల్ పూర్వవిద్యార్థుల వితరణ

గుంటూరు(విద్య),జనవరి 26(ఆంధ్రజ్యోతి) .బాపూజీ కమిటీ స్కూల్(చలమయ్య హై స్కూల్) అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ. 80వేలు విరాళం అందజేశారు. పాఠశాలలో ఆదివారంజరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఈ మొత్తాన్ని పాఠశాల కార్యదర్శి ప్రభుకు అందజేశారు. కార్యక్రమంలో బాపూజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేసు బాల శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శి టి.వి. ప్రసాద్, కమిటీ సభ్యులు మాజేటి విద్యాసాగర్, బీ కిషోర్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామయ్య హై స్కూల్‌కు ప్రథమ స్థానం


కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పాటిబండ్ల విష్ణు వర్ధన్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనకు జిల్లాస్థాయిలో మొదటి బహుమతి లభించింది. పాఠశాల విద్యార్థినిలు దేశభక్తిని చాటుతూ, ప్రధాని నరేంద్ర మోడీ, ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు లు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ పాడిన నృత్య ప్రదర్శనకు ఈ అవార్డు లభించింది. కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, డీఈవో రేణుక, ఎంఈఓ కుర్దుస్ ల చేతుల మీదుగా ఈ అవార్డును పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, నృత్యకారిణి ప్రసన్న లక్ష్మి లకు అందజేశారు.

ముగిసిన భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యువతకు సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తూ వారి శక్తియుక్తులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటే అద్భుతాలు ఆవిష్కారమవుతాయని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ బిపిఎల్ 2024-25లో భాగంగా జెకెసి కళాశాల మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల ఫైనల్స్ ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్లో వైజాగ్ వెలాసిటీ-3 జట్టు, హైదరాబాద్ హైలాండర్స్ -2 జట్టుతో తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు విజేతగా నిలిచి భాష్యం ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ షిప్‌ని చేజిక్కించుకుంది. గెలుపొందిన వైజాగ్ వెలాసిటీ-3 జట్టుకు భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, ఎండీ సాకేత్ రామ్‌లు ఛాంపియన్స్ ట్రోఫీని అంద జేశారు.

ఎల్‌వీఆర్‌లో గణతంత్ర వేడుకలు


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మైనేని బ్రహ్మేశ్వరరావు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. క్లబ్ పాలకవర్గం అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పాలకవర్గం ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలకు యాప్‌తో చెక్

● పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు
● బయోమెట్రిక్ ముఖ హాజరు తప్పనిసరి

మెప్మాలో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయడం, పొదుపు నిధులను ఇష్టానుసారంగా అప్పు ఇవ్వడం వంటి మోసాలకు ఇకపై ఆస్కారం లేదు. ఎందుకంటే, ఎఫ్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సభ్యుల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

సత్తెనపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో అక్రమాలకు, బోగస్ సంఘాలకు ఇకపై చెక్ పడనుంది. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. గత వైసీపీ పాలనలో పొదుపు సంఘాల స్ఫూర్తి దెబ్బతింది. సంఘాల పేరుతో అధికారులు, కొంత మంది నాయకులు విడుదలైన నగదును దిగమింగారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పథకాలకు అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? వారికి ఎంత లబ్ధి చేకూరింది? మొదలైన అంశాలను సర్వే ద్వారా సేకరించి కంప్యూటరీకరణ ద్వారా గుర్తిస్తున్నారు. ప్రతీ మహిళ లక్షాధికారి కావాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష. ఈ మేరకు కార్యాచరణ మొదలైంది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో 1102, వినుకొండలో 1286, పిడుగురాళ్ళలో 985, నరసరావుపేట 2,235, మాచర్ల 1059, గురజాల 560, దాచేపల్లి 218, చిలకలూరిపేటలో 2,295 పొదుపు సంఘాలు ఉన్నాయి. పొదుపు సంఘాల సభ్యులు నెలవారీ సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ సమావేశాలకు రాకుండా వచ్చినట్టు నమోదు చేయటం, మృతులను సభ్యులుగా కొనసాగించడం, బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయడం, పొదుపు నిధులను ఇష్టానుసారంగా అప్పు ఇవ్వడం వంటి అనేక రకాల మోసాలు జరుగుతున్నాయి. ఇకపై వీటన్నింటికీ చెక్ పడనుంది. నెల వారి సమావేశాలకు బయోమెట్రిక్ ఆధారిత ముఖ హాజరు తప్పనిసరి కానుంది.



ప్రత్యేక యాప్ రూప కల్పన

పొదుపు సంఘాల్లో ప్రతి సభ్యురాలి వివరాలు వెంటనే తెలుసుకునేలా మెప్మా ఎఫ్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. సభ్యుల ఆధార్‌తో అనుసంధానమైన పేర్లు, సం ఘాల్లో వారు చేరిన తేదీ, విద్యార్హత, కులం, పిల్లలు, వైకల్యం, గ్యాస్ కనెక్షన్, ప్రభుత్వ పథ కాల్లో ఎంత మంది లబ్ధి పొందారు? ఎవరికి రాలేదు, బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు, జీవనోపాధి, వృత్తి పరమైన నైపుణ్యం, నెలసరి ఆదాయం, వ్యక్తిగత పొదుపు వివరాలు నమోదు చేస్తున్నారు. అలాగే, సంఘం సభ్యురాలి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హతలు, పారిశ్రామికంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలు, సూక్ష్మ, మధ్య తరహా, పరిశ్రమల కోసం రుణాల ఆవశ్యకత, కుటుంబసభ్యుల్లో నిష్ణాతులు ఉంటే ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. అంతేగాక పొదుపు రుణాలు, వడ్డీ చెల్లింపులు, మాఫీలు, నెలవారి సమా వేశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ఉన్న గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందు కోసం మెప్మా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. సభ్యుల వ్యక్తిగత ఖాతాలకే నగదు జమ చేయడం ద్వారా మామూళ్ళ బెడద కూడా ఉండదు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

ఆర్థిక స్వావలంబనకు అవకాశం

సర్వే ద్వారా యాప్‌లో పొదుపు సంఘాలు, సభ్యుల సంపూర్ణ వివరాలు నమోదువుతాయి. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తక నిర్వహణతో సంఘాల బలోపేతంతో పాటు ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుంది. ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

- షేక్ ఖాజా, మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ), సత్తెనపల్లి

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తాం

● అగ్నిప్రమాద బాధితులకు మంత్రి మనోహర్ భరోసా



ఐసీయూలో బాధితుడిని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 24వ తేదీ శుక్రవారం రాత్రి ఏలూరు జిల్లా మండవల్లి మండలం శోభనాద్రిపురంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది గాయపడగా, అందులో ఏడుమందిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. మిగిలిన వారు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మూడు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. గుంటూరు జీజీహెచ్‌లో 80 శాతం గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మిగిలిన నలుగురికి 50 నుంచి 60 శాతం గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు బాధితులను ఆదివారం మంత్రి మనోహర్ పరామర్శించారు. వీరి పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నష్టపరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో బర్నింగ్ వార్డు లేకపోవడం లోటుగా ఉందని, బర్నింగ్ వార్డు ఏర్పాటు ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ప్రజాప్రతినిధులు ఈ విషయమై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని మంత్రి మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివా పాఠశాల వార్షికోత్సవం

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్ తొమ్మిదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఆర్మీ మేజర్ వెంకటేష్ శర్మ, వివా వీవీఐటీ



చిన్నారులకు బహుమతి ప్రదానం చేస్తున్న వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్

విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. విద్యార్థులకు క్రీడ, సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం వేడుకలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. విద్యార్థులు జై జవాన్ జై కిసాన్ అంటూ ప్రదర్శించిన నృత్యం, "భువన విజయం" నాటిక ఆకట్టుకున్నాయి. మేజర్ వెంకటేష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని లక్ష్యంగా ఎంచుకుంటే విజయం తప్పకుండా వరిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్.రావు,ప్రిన్సిపాల్ చదలవాడ సరళ,గుంటూరు క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె. మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, సీనియర్ సెకండరీ సంధానకర్త లక్ష్మీభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివా వీవీఐటీలో ఘనంగా గణతంత్ర వేడుకలు

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్, వీవీఐటీ నందు 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యాసాగర్ తదితరులు

జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోని వీవీఐటీ, వివా ఎన్.సి.సి. విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ మాట్లాడుతూ నీతి, నిజాయతీ, ఐకమత్యంతో మెలగడం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అని అన్నారు. దేశ అభ్యున్నతిలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలని, ఏదేశం వెళ్లినా స్వదేశానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివా వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డా.వై. మల్లికార్జునరెడ్డి , వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఎన్.ఎస్. ఎస్. ఆఫీసర్స్ సయ్యద్ బిబన్ భాషా, ఎ. శ్రీవాణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు



కలెక్టర్ నుంచి ఉత్తమసేవా ప్రశంసాపత్రం అందుకుంటున్న వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి

గుంటూరు సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రకటించిన ఉత్తమ సేవా పురస్కారాలలో వ్యవసాయ శాఖ పంట పండింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నూతన ఒరవడి సృష్టించిన ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి కూడా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదగా ఇరువురు అధికారులు ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. డ్వామా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కావూరి సాల్మన్ రాజు కూడా కలెక్టర్ చేతుల మీదగా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. మెప్మాలో సీఓగా పనిచేస్తున్న సయ్యద్ అహ్మద్ మునిసిపల్ కమిషనర్ చేతుల మీద గా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు.

మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

● శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు

గుంటూరు(విద్య),జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా, విభిన్న జాతులు, కులాలు, సంస్కృతులు ఉన్న భారతదేశానికి ఆవిర్భవించిన భారత పార్లమెంటరీ రాజ్యాంగం ఉత్కృష్టమైనదని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కె మోషెన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన మందిరంలో కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన భారత రాజ్యాంగం పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కె మోషెన్‌రాజు మాట్లాడుతూ దేశం గణతంత్ర వజ్రోత్సవ దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న మనదేశంలో మతాల కులాల మధ్య విభేదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం జాతీయ స్థాయిలో కుట్రలు జరుగుతున్నాయని, తద్వారా లౌకికవాదానికి ముప్పు ఏర్పడే అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం నిర్వాహకులు, శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మైనారిటీ అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలపై ఆర్థిక సామాజిక సాంస్కృతిక దోపిడీతోపాటు వారిపై సనాతన వాదాన్ని బలంగా రుద్దే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య వాదులు, ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణలను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్న ప్రతిసారి న్యాయవ్యవస్థ ప్రజల పక్షంగా బలంగా పని చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ చేస్తున్నదన్నారు.



భారత రాజ్యంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు తదితరులు

కార్యక్రమంలో కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి కె. అలిన్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డాక్టర్ వీ నారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు, రాజ్యాంగ చర్చా వేదిక అవధానుల హరి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వీ లక్ష్మణరెడ్డి, ఆవాజ్ నాయకులు చిష్టి, విశ్లేషకులు బీ మల్లికార్జునరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజిఎస్ పబ్లిషర్స్ ద్వారా ప్రచురితమైన "భారత రాజ్యాంగం" (సంక్షిప్తంగా) పుస్తకాన్ని శాసన మండలి చైర్మన్ మోషన్ రాజు, "రాజ్యాంగ నిర్మాణం -రాజ్యాంగ పీఠిక" పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం అనే పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాస రావు, భారత రాజ్యాంగం ముఖ్యాం శాలు పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలీన వ్యాసాలు పుస్త కాన్ని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి తదితరుల చేత ఆవిష్కరింపచేశారు.

నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేయాలని ప్రయత్నిస్తున్న కేంద్రం

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య

నరసరావుపేట టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలు పాటు రైతులు, కార్మికులు పోరాటం చేస్తే దిగివచ్చి క్షమాపణ చెప్పి చట్టాలను వెనక్కి తీసుకుంటామని చెప్పిందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ



ర్యాలీలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య, ఏపూరి గోపాలరావు తదితరులు

జాతీయ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు నరసరావుపేట పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి ట్రాక్టర్, బైక్‌లతో భారీ ర్యాలీ ప్రధాన వీదుల నుంచి గాంధీపార్కు వరకు నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూడి గోపాలరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య మాట్లాడు తూ అవే చట్టాలను కేంద్రం అమలుచేయాలని చూస్తుందన్నారు. దీనివల్ల వ్యవసాయంపై ఆధార పడిన రైతుల పరిస్థితి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు స్వామినాధన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరలు చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని 57 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జగజీత్ సింగ్ దల్లేవాల్‌కు ఏమైనా జరిగితే కేంద్రప్రభుత్వం బాధ్యత వహిం చాల్సి ఉంటుందన్నారు. ఉలవలపూడి రాము, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్ బాషా, కార్మిక సంఘాల నాయకులు ఎస్ ఆంజనేయనాయక్, కాసా రాంబాబు, సీఐటీయూ శ్రామిక మహిళాసంఘం డీ శివకుమారి, కిసాన్ మహసభ తోట ఆంజనేయులు, పీకేఎస్ కొండలు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేసారు. పోలీస్ కార్యాలయ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించి నేటికి 75 ఏళ్లు పూర్తై 76వ ఏటలో అడుగుపెడుతున్న సందర్భంగా గణతంత్ర వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. మన దేశం యొక్క గొప్ప చరిత్రకు ప్రజాస్వామ్య సూత్రాలు, నిబద్ధతకు నిదర్శనం గణతంత్ర దినోత్సవం అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తి, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, పోలీస్ కార్యాలయ ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో క్రీడాకారులకు రూ.70 లక్షల నగదు ప్రోత్సాహకాలు

మంగళగిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా భారత్ తరపున పారిస్ ఒలింపిక్స్‌కు హాజరైన వర్సిటీ విద్యార్థిని దండి జ్యోతికశ్రీ(రన్నర్)కు యాజమాన్యం రూ.20 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేసింది. వివిధ క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్న క్రీడాకారులకు క్యాష్ అవార్డులను అందజేశారు. కుంజా రజితకు రూ.2 లక్షలు, రంగోలి స్వాతికి రూ.లక్ష, ముగదా శిరీషకు రూ.2.30 లక్షలు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు సుమైర్ షేక్‌కు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.70 లక్షల విలువైన నగదు ప్రోత్సాహకాలను క్రీడాకారులకు అందించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఎస్ఆర్ఎం ఉద్యోగులు డాక్టర్ అరుంధతి, రేవతి బాలకృష్ణన్, లావణ్య, శంకర నారాయణలకు ప్రసంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్య క్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, డీన్‌లు భరద్వాజ్, విష్ణుపథ్, సీవీ టామీ, డైరెక్టర్లు అనూప్‌సింగ్, పంకజ్ బల్వేరియా, అనిల్ నిగమ్, రేవతి, సుస్మిత, శివరంగన్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతికశ్రీకి రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

డాక్టర్ నరేష్‌బాబుకు జాతీయ అవార్డు

● ఏఎస్ఎస్ఐ స్పైన్ క్లినిక్ రీసెర్చ్ అవార్డ్ కైవశం
● తెలుగు రాష్ట్రాల్లో ఈ అవార్డు సాధించడం ఇదే తొలిసారి

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ప్రముఖ వెన్నెముక వైద్యనిపుణులు జే నరేష్‌బాబు అసోసియేషన్ ఆఫ్ స్పైన్స్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) అందజేసే



నరేష్‌బాబుకు అవార్డు అందజేస్తున్న సౌమ్యజిత్, రూపేందర్ సింగ్

బెస్ట్ స్పైన్ క్లినికల్ రీసెర్చ్ అవార్డ్ 2024 గెలుచుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్థోపెడిక్ వైద్య రంగంలో పరిశోధనకు స్పైన్ క్లినికల్ రీసెర్చ్ అవార్డు దక్కడం ఇదే తొలిసారి. సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధి అంతిమ దశలో రోగులు చేతిలో తిమ్మిర్లు, బ్యాలెన్స్ కోల్పోవడం, ఎత్తు పల్లాల్లో నడవ లేకపోవడం, కళ్లు మూసుకుంటే తూలుడు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సార్లు ఇవి పక్షవాత లక్షణాలను పోలి ఉంటాయి. ఈ అంశంపై డాక్టర్ నరేష్‌బాబు గుంటూరు మల్లిక స్పైన్ సెంటర్‌లో ఏడాది పాటు 100 మంది రోగులపై పరిశోధన జరిపారు. రోగులు కూర్చున్న భంగిమలో ఎంఆర్ స్కానింగ్ తీస్తే మెడ నరాల్లో సీ4, సీ5 వద్ద నరాలపై ఒత్తిడి పడుతున్నట్లు తేలింది. రోగులు పడుకున్న భంగిమలో ఎంఆర్ఐ తీస్తే సీ3, సీ4 మెడ నరాలపై ఒత్తిడి పెరుగుతున్నట్లు గుర్తించారు. సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధి నిర్ధారణలో ఇది కొత్త అంశం. సీ3, సీ4 ఆధారంగా వ్యాధి తీవ్రతను ముందుగానే గుర్తించవచ్చు. ఈ అంశంపై డాక్టర్ నరేష్ బాబు సమర్పించిన పరిశోధన పత్రానికి ఏఎస్ఎస్ఐ జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి లభించింది. గత వారం బెంగళూరులో జరిగిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సౌమ్యజిత్ బసు, కార్యదర్శి రూపేందర్ సింగ్ చాహల్ ఈ అవార్డును డాక్టర్ నరేష్‌బాబుకు ప్రదానం చేశారు. అవార్డు కింద మెడల్, రూ25 వేలు నగదు బహుమతిని అందజేశారు.

జాతీయ కార్యదర్శిగా ఎంపిక...

అసోసియేషన్ ఆఫ్ స్పైన్స్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) జాతీయ కార్యదర్శిగా డాక్టర్ నరేష్‌బాబు ఎంపికయ్యారు. 2027-29 సంవత్సరాలల్లో ఆయన జాతీయ కార్యదర్శిగా కొనసాగుతారు. ప్రస్తుతం డాక్టర్ నరేష్ బాబు సంఘం జాతీయ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

ఎండో వ్యాస్క్యులర్ సర్జరీలతో రోగులకు ఉపశమనం

● డాక్టర్ విజయ్‌కుమార్ విష్ణుమొలక వెల్లడి

గుంటూరు (మెడికల్) జనవరి 26: ఎండో వ్యాస్క్యులర్ సర్జరీల్లో స్టెంట్లు, గ్రాఫ్ట్స్, ఎంబలైజేషన్ వంటి ప్రక్రియలు నిరంతరం పురోగమిస్తూ మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు దోహదపడుతున్నట్లు ఎండోవ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ విష్ణుమొలకల తెలిపారు.



జ్యోతి ప్రజ్వలనతో సీఎంఈను ప్రారంభిస్తున్న డాక్టర్ సంజయ్ తదితరులు

ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన ఎండోవ్యాస్క్యుర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గుండె, రక్తనాళాల వ్యాధుల వైద్య రంగంలో ఆధునికంగా చోటు చేసుకుంటున్న అధునాతన వైద్య ప్రక్రియలు, నూతన వైద్య పరిజ్ఞానం గురించి సీఎంఈ కార్యక్రమాల ద్వారా వైద్యులు తెలుసుకోవచ్చని డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. డాక్టర్ సురేష్ రెడ్డి తుపాకుల మాట్లాడుతూ సంక్లిష్టమైన గుండె, రక్తనాళాల వ్యాధుల చికిత్సల్లో రోగి ప్రయోజనాలను గరిష్టస్థాయికి చేర్చేందుకు, ప్రమాదాలను తగ్గించేందుకు ఎండో వ్యాస్క్యులర్ సర్జరీలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ సురేంద్ర నాగలపాటి, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్ గురించి, వాటి చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాస్క్యులర్ సర్జన్లు డాక్టర్ సంజయ్ సి దేశాయ్, డాక్టర్ ఆర్ చంద్రశేఖర్, డాక్టర్ తాపీష్ సాహు, డాక్టర్ దివాకర్, డాక్టర్ హర్షతో పాటు 300 మంది వైద్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి 'హ్యాపీనెస్' ప్రోగ్రాం

తాడేపల్లి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్స్ ఎయిర్ బ్రీత్ హ్యాపీనెస్ కార్యక్రమం జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తాడేపల్లిలోని ఏఎస్ఆర్ నేచురల్ ఫార్మ్‌లో మొదటి బ్యాచ్ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రెండో బ్యాచ్ 10.30 నుంచి 12.30 వరకు పూజిత అపార్టుమెంట్స్‌లో జరుగుతుందని తెలిపారు. ఆందోళన సమస్యలు, ఉద్రిక్తతలు, ఒత్తిడి, భయం, హ్యాపీనెస్ రిలాక్సేషన్, శాంతి, విశ్వాసం, మనసులో స్పష్టత, ఫోకస్ బెటర్ హెల్త్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 9949396940లో సంప్రదించాలని ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, ఇట్టా భాస్కర్‌లు తెలిపారు.

సీఐ వాసుకు అంత్రిక్ సురక్ష మెడల్



కలెక్టర్ నుంచి మెడల్‌ను స్వీకరిస్తున్న సీఐ వాసు

తాడికొండ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తాడికొండ సీఐ కే వాసు పోలీసు అంత్రిక్ సురక్షా సేవా పథకం-2022కు ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. మెడల్‌ను అందుకున్న సీఐ వాసును స్టేషన్ సిబ్బంది అభినందించారు.

● తాడికొండ మండలం హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న సాగర్ సురేష్ ఉత్తమ ఏఈగా మెడల్‌ను అందుకున్నారు. లాం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న డీ అరుణ్‌కుమార్‌కు ఉత్తమ పంచాయతీ సెక్రటరి అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. డీఆర్‌డీఏ వెలుగులో సీసీగా పనిచేస్తున్న ఏ.రాఘవేంద్రరావుకు ఉత్తమ కమ్యూనిటి కోఆర్డినేటర్‌గా ప్రసంశాపత్రాన్ని కలెక్టర్ అందజేశారు.

ట్రాఫిక్ ఎస్ఐ నారాయణకు ప్రశంసా పత్రం



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తాడేపల్లి ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ

తాడేపల్లి టౌన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి ట్రాఫిక్ ఎస్ఐ నారాయణకు ప్రశంసాపత్రం లభించింది. ఆదివారం కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ నారాయణకు ప్రశంసాపత్రం అందజేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది నారాయణను అభినందించారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు

మంగళగిరి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మంగళగిరి పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీ శ్రీనివాసరావు ప్రశంసాపత్రం అందుకున్నారు. దాతల సహకారంతో మంగళగిరి పశు వైద్యశాలను అభివృద్ధి చేసినందుకు గాను ఈ అవార్డును అందజేశారు. రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ ఎం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వెలగపూడి జయలక్ష్మికి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. తిరుపతి కల్యాణి డ్యాం వద్ద పోలీసు ట్రైనింగ్ కళాశాల మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనర్, అథ్లెటిక్స్ కోచ్‌గా పనిచేస్తున్న మంగళగిరికి చెందిన పీపీఎస్‌బీ సత్యనారాయణ ఎస్పీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

ప్రత్తిపాడులో ముగ్గురికి

ప్రత్తిపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడింపాలెంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లం నాగలక్ష్మి, ప్రత్తిపాడు ఆర్ఐ జీ రామకృష్ణ, అనస్తీషియా వర్షశ్రీలు కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న ఉద్యోగులను ఆయా శాఖల సిబ్బందితో పాటు మండల అధికారులు అభినందించారు.

పురస్కార గ్రహీతలకు అభినందనలు

దుగ్గిరాల జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఈవో రమేష్ కలెక్టర్ నాగలక్ష్మి నుంచి వ్యవసాయ విభాగంలో జిల్లా ఉత్తమ సేవాపురస్కారం అందుకున్నారు. అదేవిధంగా దుగ్గిరాల 108 అంబులెన్స్ పైలెట్ తోట శ్రీనివాసరావు ఉత్తమ పురస్కారాన్ని కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. గుంటూరులో జరిగిన రిపబ్లిక్ వేడుకల సందర్భంగా, ఉత్తమ పురస్కారం అందుకున్న శ్రీనివాసరావు, రమేష్‌లను ఎంపీడీవో ఏ శ్రీనివాస రావు, తహసీల్దార్ ఐ. సునీత, ఏవో పీ శిరీష, వ్యవసాయశాఖ సిబ్బంది, 108 జిల్లా అధికారులు, ఈఎంటీ ఆనంద్, ప్రసాద్‌రాజ్ తదితరులు అభినందించారు.

వ్యక్తి మృతిపై కేసు

పెదనందిపాడు, జనవరి, 26 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందిన సంఘటనపై ఆదివారం పోలీసుస్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం మండలపరిధిలోని పాలపర్రుకు చెందిన ఇనగంటి హుస్సేన్‌సాహెబ్ (75) ఈనెల 24న పెదనందిపాడు వచ్చి చిల్లర సరుకులు తీసుకొని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఆటోలో వెనుక కూర్చొని ప్రయాణిస్తున్న సమయంలో కళ్లు తిరిగి క్రింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కుమారుడు సైదులు సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

● ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కార్యాలయాల్లో త్రివర్ణ పతాక రెపరెపలు

మంగళగిరి సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఆదివారం మంగళగిరిలో ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అక్రమ మద్యం రహితంగా మార్చడమే లక్ష్యంగా ఈ ఏడాది



జెండా వందనం చేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్



ఎమ్మెస్సెస్ భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న టీడీపీ నేతలు

జనవరి 31వ తేదీన నవోదయం 2.0ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం విశిష్ట సేవలందించిన 140 మంది అధికారులకు ప్ర శంసా పురస్కారాలను అందజేశారు. 13 మంది రాష్ట్ర స్థాయి అధికారులు, 13 మంది ఏపీఎస్‌బీసీఎల్ అధికారులు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 39 మంది ఇన్‌స్పెక్టర్లు, 14 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, పది మంది హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లు, 17 మంది మినిస్టీరియల్ సిబ్బంది ఈ అవార్డులు అందుకున్నారు. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో కమాండెంట్ కేనగేష్‌బాబు జాతీయ జెండాను ఎగురవేయగా, సిబ్బంది గౌరవ వందనం చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. అడిషనల్ కమిషనర్ కే.శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శ్రీనివాసరావు, కార్యదర్శి దివ్య కుమారి, సిబ్బంది పాల్గొన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి జాతీయ జెండాను ఎగురవేశారు. టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు గాదె పిచ్చిరెడ్డి, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, వాకా మాధవరావు, మల్లవరపు వెంకట్, గోసాల రాఘవ, రంగిశెట్టి పెద్దబ్బాయ్, ఒడిశా నరేష్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు జాతీయ జెండాను ఎగురవేశారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ పట్టణ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, నేతలు కే.రాకేష్, యశోదకృష్ణ, మునగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, నేతలు శివరాం బాబాజీ, పారేపల్లి మహేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి/తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి మండల, పట్టణంలో గణతంత్రదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులు సిబ్బంది జాతీయ పతాకావిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అనేక మంది దేశభక్తుల త్యాగఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని మన రాజ్యాంగం 26 జనవరి 1950న అమల్లోకి వచ్చిందని చెప్పారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఎండీ రేణంకి కూర్మనాథ్ పతాకావిష్కరణ చేయగా ఈడీ డాక్టర్ సి.నాగరాజు, ఏవో దీపక్, ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఎస్‌లు, ఫైర్ ఆఫీసర్లు పాల్గొన్నారు. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీ సీతారామయ్య, ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, అసోసియేషన్ సభ్యులు, వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం సుబ్బారావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మహానగర్ విజయవాడ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కాకుమాను జోజప్ప, సుందరరావు తదితరులు పతావిష్కరణలు చేశారు. చిగురు ఆశ్రమంలో తహసీల్దార్ డీ సీతారామయ్య అనాథ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

తాడేపల్లి పట్టణ మండలంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల కార్యాలయం వద్ద అమరా సుబ్బారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన నేతలు కానుగోలు కోటేశ్వరరావు, మేకల రాజా, పసుపులేటి అశోక్, బొర్రా కృష్ణవందన తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కార్యాలయంలో అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జుంజు మరియదాసు, మేకా పుల్లారెడ్డి, ఇట్టా భాస్కర్, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, అన్నెం కుసుమ, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, కొయ్యగూర మహాలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి టీడీపీ మండల కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు

● ఉండవల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ షేక్ సలీం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్వేచ్ఛా పోరాటానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సంఘీభావం, సోదరభావం వంటి గొప్ప ఆదర్శాలకు ప్రతీకగా గణతంత్ర దినోత్సవం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చవ్వాకుల రాఘవరావు, దర్శనపు శామ్యూల్, మున్నంగి దశరథరెడ్డి, ఆదెయ్య, పోతురాజు, కళ్ళం సంజీవరెడ్డి, ఆర్ల వెంకటస్వామి, గుడిపాటి అర్జునరావు, కృష్ణచౌదరి, చిలకా కార్తీక్, సమర్పణకుమార్ తదితరులు పాల్గొన్నారు. మూడు బొమ్మల సెంటర్లో పోలకంపాడు వద్ద దర్శనపు శామ్యూల్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలుగ్రామాల్లో గణతంత్రదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఐ సునీత జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. దుగ్గిరాలలోని జడ్పీబాలురు, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపీడీవో కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు జాతీపతాకాన్ని ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, తహసీల్దార్ సునీత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లోనూ, పోస్టాఫీస్‌లోనూ, సబ్ రిజిస్ట్రార్, నీటిపారుదల శాఖ, పలుప్రభుత్వ పాఠశాలల్లోనూ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు.

● **కాకుమాను (ఆంధ్రజ్యోతి):** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ముజావర్ గుల్జార్‌బేగం, సర్పంచ్ శివపార్వతి, డీటీ ప్రణతి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో యుగకీర్తి జాతీయ జెండాను ఎగురవేశారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు.

● **పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఏఎస్ కళాశాల, నంది పాఠశాలలో కళాశాల అధ్యక్షుడు, విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, లయన్స్ మాటీస్సోరీ సీబీఎస్‌లో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి, అశోక పాఠశాలలో డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, పోలీసుస్టేషన్లో ఎస్ఐ మధుపవన్, అన్నపర్రు, జిల్లా పరిషత్ పాఠశాల, బాలుర వసతి గృహంలో ఎంపీటీసీ కల్లూరి నాగేశ్వరరావు, ఆయా గ్రామపంచాయతీల వద్ద కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు.

● **వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం, జడ్పీ హైస్కూల్లో ఎంపీడీవో రమేష్‌బాబు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సర్పంచులు, సెక్రటరీలు జాతీయ జెండాలను ఎగుర వేశారు.

● **ఫిరంగిపురం (ఆంధ్రజ్యోతి):** మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జే ప్రసాదరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సహేల నర్గీస్, పోలీసుస్టేషన్‌లో సీఐ బీ రవీంద్రబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ మాట్లాడుతూ దేశానికి అతి పెద్ద రాజ్యాంగాన్ని ఇచ్చిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.

చలపతి కళాశాలలో..



చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి యువత పాటుపడాలని చలపతి కళాశాలల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. లాం చలపతి ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● మేడికొండూరు (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు ఎంపీడీవో కార్యాలయంలో మండలపరిషత్ అధ్యక్షురాలు మన్నవ స్వప్న, జడ్పీటీసీ కందుల సిద్ధయ్య సమక్షంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో చందన జెండాను ఆవిష్కరించారు.

రాజధాని గ్రామాల్లో..

తుళ్లూరు (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. తుళ్లూరు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శిల్ప త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకర్, వెలుగు ఏపీఎం చిన వీరయ్య, ఎం ఈవో బాషా సిబ్బంది ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ మురళీకృష్ణ జాతీయ జెండాను ఎగరవేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు అంబే ద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి వినాళి అర్పించారు. తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు.



పీఏఎస్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కళాశాల అధ్యక్షుడు, విశ్రాంత ఏఎస్పీ సత్యనారాయణ



తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

రైతాంగ కార్మిక, ప్రజావ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

● ట్రాక్టర్, బైక్ ర్యాలీలో ప్రజాసంఘాల నేతలు

తాడేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతాంగ, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజాసంఘాలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లి మండలంలో బైక్, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లి సాయిబాబా గుడి నుంచి ప్రారంభమై తాడేపల్లి, కొత్తూరు, కొలనుకొండ, కుంచనపల్లి, వడ్డేశ్వరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజావ్యతిరేక విధానాలు పెరిగాయన్నారు. అన్ని వర్గాలవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కార్పొరేట్ పాలన నడిపిస్తోందన్నారు. కారక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, అధ్యక్షుడు జొన్నా శివశంకర్, సీపీఐ, సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, కంచర్ల కాశయ్య, తుడిమెల్ల వెంకటయ్య, పల్లె కృష్ణ, కాజ వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రంగారావు, విజయభాస్కర రెడ్డి, రాఘవయ్య, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నేతలు

పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు, నాయకులు కొత్త వెంకటశివరావు, దొప్పలపూడి రమేష్‌బాబు, కావు వెంకటసుబ్బారావు, ముద్దన వెంకటేశ్వర్లు, గొల్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

తుళ్లూరు, జనవరి 26(ఆంధ్ర జ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను నిలిపివేయాలని ఆదివారం తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి ఎం రవి, భాగ్యరాజ్‌లు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పేరంబాబురావు, రామారావు, హరి నరేష్, గైరబోయిన నాగేశ్వరావు, పూర్ణచందరావు, బుజ్జి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వీఏఏ షణ్ముఖ క్షేత్రపాల్

కాకుమాను, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకుమాను రైతు సేవాకేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుడిగా పని చేస్తున్న ఉత్తమ వీఏఏగా కలెక్టర్ నాగలక్ష్మి నుంచి ప్రశంసా పత్రాన్ని శనివారం గుంటూరు కలెక్టరేట్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ వీఏఏ అవార్డు అందుకున్న షణ్ముఖ క్షేత్రపాల్‌ను ఏవో కిరణ్మయి, కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు



నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

పెదనందిపాడు, జనవరి, 26 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జీజీపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు జీ శ్రీనివాసరావుకు పాండిచ్చేరిలో జరిగిన జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శనివారం నిర్వాహకులు అవార్డును అందజేశారు. ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, జాకబ్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

సూపర్ సిక్స్‌తో పేదలకు రాజ్యాంగ ఫలాలు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జనవరి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరికి రాజ్యాంగ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విద్యానగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో గణనీయ అభివృద్ధిని సాధించామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. మరో వైపు పీ4తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, శేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జాతీయజెండాతో ర్యాలీ



ప్రత్తిపాడులో 220 అడుగుల జాతీయజెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఘన తంత్ర దినోత్సవ వేడుకలు ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ జండాలను ఎగుర వేశారు. ప్రత్తిపాడు శ్రీనివాస స్కూల్‌కు చెందిన విద్యార్థులు 220 అడుగుల జాతీయజెండాతో గ్రామంలో నిర్వహించిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర సమయ యోధుల వేషధారణలతో విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలతో పాటు వివిద శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడుకు చెందిన సరోజిని విద్యాలయం విద్యార్థినీ విద్యార్థులు జాతీయ నాయకుల వేషదారణలతో అందరినీ ఆకట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కరుణ కుమార్ జాతీయ జండాను ఎగుర వేశారు. పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ నాగేంద్ర జాతీయ జండాను ఎగుర వేశారు.

● మండల పరిధిలోని గొట్టిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని పాఠశాల పూర్వ విద్యార్థి పచ్చల అన్నపూర్ణ, వీరయ్యలు పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, కలర్ ప్రింటర్‌ను హెచ్ఎం వేణుగోపాలరావుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మరియరాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాడేపల్లి తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది సత్కారం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న మండల రెవెన్యూ సిబ్బంది

తాడేపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి తహసీల్దార్ డీ సీతారామయ్యకు బెస్ట్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా అవార్డు అందుకోవడంతో తాడేపల్లి మండలం రెవెన్యూ సిబ్బంది ఆదివారం తహసీల్దార్‌ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కొమ్మా వేదాంతరావు, రిజ్వానా, సర్వేయర్ రవితేజ, కార్యాలయ సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సహాయకులు పాల్గొని తహసీల్దార్‌ను సత్కరించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు సేవా పురస్కారం

మంగళగిరి సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడ నగరంలో సంభవించిన వరదల్లో సహాయక చర్యలను అందించిన హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు సేవాపురస్కారం లభించింది. వరదలతో అతలాకుతలమైన విజయవాడలో లక్షలాది మందిని ఆదుకోవడంతోపాటు సంస్థ తరఫున సుమారు 16లక్షల మందికి భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈ సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీషా చేతుల మీదుగా హరేకృష్ణ మూవ్‌మెంట్ క్లస్టర్ అధ్యక్షుడు వంశీధర దాస ఆదివారం ఈ అవార్డును అందుకున్నారు.

ఆరుగురికి ఉత్తమ బీఎల్‌వోలుగా ప్రశంసాపత్రాలు

ఫిరంగిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగురు అధికారులకు ఉత్తమ బీఎల్‌వోలుగా కలెక్టర్ నాగలక్ష్మి ద్వారా ప్రశంసాపత్రాలు అందుకున్నారని ఫిరంగిపురం ఏవో ఏకే బాబు ఆదివారం తెలిపారు. రాష్ట్ర రాజధాని ప్రాంతం నేల పాడులోని విట్ కళాశాలలో జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఈనెల 25న జరిగిన ఓటర్ల దినోత్సవం నాడు ఫిరంగిపురం ఈవో ఏకే బాబు, గుమస్తా గూడూరు సూర్యనారాయణ, షేక్ సహీల, శ్రావణి, షరీఫ్, అరుణలు ప్రశంసా పత్రాలు అందుకు న్నారన్నారు. దీనిపై గ్రామ పెద్దలు సర్పంచ్ మేడాబాబు, బోర్డు మెంబర్లు ఉత్తమ బీఎల్‌వోలకు అభినందనలు తెలిపారు.

ఉత్తమ సహాయ గణాంకాధికారిగా నిమ్మల శివ

ఫిరంగిపురం రెవెన్యూ కార్యాలయం లో ఏఎస్‌వోగా పనిచేస్తున్న నిమ్మల శివ కలెక్టర్ నుంచి ఆదివారం ఉత్తమ సహాయ గణాంకాధికారిగా అవార్డు తీసుకున్నారు. అంతేగాక ఇదే కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న జీ వెంకటేశ్వర్లు ఉత్తమ సర్వేయర్‌గా అవార్డు తీసుకోవటంపై తహసీల్దార్ ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది వారిని అభినందించారు.

రజక కమ్యూనిటి హాల్ నిర్మాణం పూర్తి చేయాలి

తాడేపల్లి టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రజక కమ్యూనిటి హాల్ నిర్మాణం పూర్తి చేయించి రజకులకు ఉపయోగపడే విధంగా కృషి చేయడమే అమరజీవి మోర్తోట సుబ్బారావుకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య అన్నారు. నిర్మాణంలో ఉన్న కమ్యూనిటి హాల్ స్థలంలో వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఇటీవల మృతిచెందిన సంఘం నాయకులు మోర్తోట సుబ్బారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ సభలో భాస్కరయ్య మాట్లాడుతూ రజకవృత్తిదారుల సమస్యలపై నిరంతరం సుబ్బారావు పోరాటాలు చేశారని చెప్పారు. ఆయన మృతి సంఘానికి తీరని లోటన్నారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు వల్లభాపురం వెంకటేశ్వరరావు, బొజ్జా సుబ్బారావు, ఈమని రామారావు, మందూరి వెంకటనరసయ్య, పాగోలు శ్రీనివాసరావు, ఉండవల్లి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



మెగా జాబ్‌మేళాలో విద్యార్థులతో వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

తెనాలి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. స్థానిక ఎన్నారై జూనియర్ కళాశాలలో ఆదివారం వేమూరు, తెనాలి నియోజకవర్గాల యువతీ యువకుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, గత ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఉపాధి ఇచ్చే కంపెనీలను రాష్ట్రానికి రాకుండా చేయడంతో పాటు ఉన్న కంపెనీలను కూడా బెదరగొట్టి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. అమర్‌రాజా గ్రూప్ సంస్థలు ఎంతో మందికి ఉపాధి ఇస్తున్నాయని, 10వ తరగతి, ఇంటర్ చదివిన వారికి అవకాశాలు అందిస్తున్నాయన్నారు. అలాంటి పరిశ్రమను రాష్ట్రం నుండి వెళ్లగొట్టేదాకా గత ప్రభుత్వం నిద్రపోలేదన్నారు. యువతకు తగిన నైపుణ్య శిక్షణను అందించడంతో పాటు ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలు స్థాపించి యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు పడుతున్నాయని, ఐదేళ్లలో గణనీయమైన ప్రగతిని ప్రతిఒక్కరూ చూస్తారని చెప్పారు. కంపెనీ ప్రతినిధులతో పాటు పలువురు టీడీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్ఐగా ప్రతాప్‌కుమార్



ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్ఐ ప్రతాప్‌కుమార్

తెనాలి రూరల్, జనవరి26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ జిల్లావ్యాప్తంగా ఉత్తమ ఎస్ఐగా ప్రతాప్‌కుమార్ అవార్డు అందుకున్నారు. శనివారం గుంటూరులో జరిగిన క్రైం సమీక్షలో ఎస్పీ సతీష‌కుమార్ తెనాలి రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్‌ను అభినందించి ఆయనకు ప్రశంసాపత్రంతో పాటు అవార్డును అందించారు.

పౌష్టికాహారం కిట్లు పంపిణీ

తెనాలి అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థ మానవతా ఆధ్వర్యంలో ఆదివారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. పాత ప్రభుత్వ వైద్యశాలలో చైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం ఈ కిట్లు పంపిణీ చేశారు. టీబీ, హెచ్ఐవీ బాధితులకు అవసరమైన పౌష్టికాహారం ఈ కిట్ల ద్వారా లభిస్తుందని తహసీల్దార్ పేర్కొన్నారు. దాసరి శ్రీనివాసులు, రాజశేఖర్, రవికుమార్, ఓంకార ప్రసాద్, కళ్యాణి పాల్గొన్నారు. ఉత్తమ తహసీల్దార్‌గా కలెక్టర్ నుండి పురస్కారం అందుకున్న గోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. అప్పారావు, వెంకట్, మొవ్వా సత్యనారాయణ, సోమయ్యశాస్త్రి, శర్మ, ఆలపాటి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

సంతాన లేమి సమస్యలకు ఆధునిక వైద్యచికిత్సలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమ

తెనాలి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సంతాన లేమి సమస్యలకు ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫెర్టిలిటీ క్యాంపును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు ఆహార నియమాలను పాటించాలని, వైద్యుల సలహాలను తీసుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, ఆలపాటి కిరణ్, ఉపేంద్ర, హరిప్రసాద్, నారాయణ, కన్నెగంటి మురళి పాల్గొన్నారు.

నేడు మంత్రి మనోహర్ వార్డు పర్యటన

తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం పట్టణంలోని 1, 2 వార్డుల్లో పర్యటించనున్నారు. అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలను నేరుగా అధికారులతో కలిసి తెలుసుకోనున్నట్లు కార్యాలయ వర్గాలు ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు

తెనాలి రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరగలరని 1977-78 కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వవిద్యార్థులు చెప్పారు. ఆదివారం రిపబ్లిక్ డే ను పురస్కరించుకుని హైస్కూల్‌లో క్రీడలు, చదువులో మంచి ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం, సిబ్బంది, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ శేషన్న, కౌన్సిలర్లు కోటేశ్వరావు, సంజీవరెడ్డి తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు చినరావూరు పార్కు వాకర్స్ సొసైటీ సభ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక చినరావూరుపార్కు వాకర్స్ సొసైటీ అధ్యక్షుడు, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బందికి దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొని కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కేసన శంకరావు, బూర్లే నరసింహారావు, జొన్నాదుల నరసింహారావు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వాసు, నాగరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన జీవితం

● ప్రముఖ వైద్యుడు డాక్టర్ పవన్

తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ వ్యాయామం, తగినంత నిద్ర, ఆకుకూరలు తాజా కూరగాయలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ పవన్ చెప్పారు. ఆదివారం చెంచుపేట శ్రీశబరి వృద్ధాశ్రమంలో విజయవాడకు చెందిన దోస్తి ఇనిషియేటివ్ సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 18మంది వివిధ విభాగాల వైద్యబృందం రోగులను పరీక్షించి మందులు అందించారు. శబరి వృద్ధాశ్రమ నిర్వాహకులు ధర్మకుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్లు ఇస్మాయిల్ ఖాన్, అజీమ్‌ఖాన్, జయంత్, సురేష్, నయీాన్‌ఖాన్, పావని, కీర్తి, చిరంజీవి, విశ్వ హరిచందన, మోన, లాస్య, యోచన, మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు విద్యార్థిని రావుల లీలావతి కాలేజ్ ఫీజు నిమిత్తం ఆదివారం రూ.25 వేలు అందించారు. సంస్థ అధ్యక్షుడు కటికి శ్రీకాంత్, సంస్థ జనరల్ సెక్రటరీ నరిశెట్టి మహేశ్వరరావు, సభ్యులు తోట భరత్, ఆరిశెట్టి శివన్నారాయణ, గోళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనతంత్ర వేడుకలు

తెనాలి అర్బన్/రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో ఆదివారం రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఎన్నారై డిగ్రీ కళాశాలలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జెండా ఎగురవేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మహనీయుల త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని చెప్పారు. సీఈవో ఉమామహేశ్వరరావు, తాడిబోయిన హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, మహ్మద్ ఖుద్దూస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అంబేద్కర్ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకులు కాకి సమాధానరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. కరస్పాండెంట్ మన్నవ మేరిగ్రేస్, ప్రియదర్శిని, అశోక్‌వర్ధన్, జంగం సుధీర్, సౌమ్యానాయక్ పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో 11వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసులు, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని, న్యాయమూర్తులు శ్రీధర్, వివేకవర్ధన్, రాజశేఖర్‌లు జెండా వందనం చేశారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శీను, బుల్లియ్య, పూర్ణచంద్రరావు, శివకుమార్, స్టీవెన్, కోటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గుప్తా డిగ్రీ కళాశాలలో కమిటీ అధ్యక్షుడు నంబూరు వెంకటకృష్ణమూర్తి జెండా ఎగురవేశారు. గుగ్గిలం రామమోహనరావు, బొలిశెట్టి ప్రభాకరరావు, బదిరీనాథ్, ప్రిన్సిపాల్ విజయకృష్ణ పాల్గొన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఫ్రాంక్లిన్, ప్రసాద్, శ్రీనివాసరావు, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు



కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మున్సిపల్ ఏసీపీ శివన్నారాయణ, సీఎంఎం విజయకుమారిలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరువరాదు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలలో అమరులైన సమరయోధుల త్యాగాలను మరువరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొనగా కమిషనర్ శేషన్న జాతీయ జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక వహాబ్‌చౌక్‌లో గణతంత్ర వేడుకలను కుర్రా శ్రీను, సయ్యద్ బాషాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ది ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, దేసు యుగంధర్, కుర్రా సుజాత, యడ్రపాటి అశోక్‌కుమార్, కఠారి హరీష్, ఆవుల కోటయ్య, యలవర్తి సాంబశివరావు, షేక్ మీరావలి, షేక్ కాలేషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జేఎంజే కళాశాలలో గణతంత్ర వేడుకలను కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ, రసాయన శాఖ విభాగం సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రా లయోలా కాలేజ్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ శామ్యూయేల్ దయాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, డాక్టర్ కె.నిర్మలజ్యోతి, జి.ఎస్తేరురాణి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనపర్చిన మున్సిపల్ అధికారులకు అవార్డులు

తెనాలి, మారీసుపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలలో కలెక్టర్ నాగలక్ష్మి స్థానిక పురపాలక సంఘ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, మున్సిపల్ మెప్మా సీఎంఎం విజయకుమారిలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మున్సిపల్ కార్యాలయంలో....

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో పురపాలక సంఘ కార్యాలయం, సచివాలయాలలో ఉత్తమ సేవలను అందించిన 40మంది అధికారులకు ప్రశంసాపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీనేతలు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడారు. తహసీల్దార్ గోపాలకృష్ణ తన కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని కొలకలూరు శాఖ గ్రంథాలయంలో అధికారి కడియాల సుజాత ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉత్తమ తహసీల్దార్‌గా గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా గోపాలకృష్ణ చేసిన కృషిని అభినందిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తమ తహసీల్దార్ అవార్డును ఆయనకు అందించారు. ఆదివారం గుంటూరులో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో తహసీల్దార్ గోపాలకృష్ణకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 76వ గణతంత్రదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో పతాకావిష్కరణ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రమేష్, సచివాలయాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు, విద్యుత్ కార్యాలయంలో డీఈఈ రాజశేఖర్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో వెంకట్రావులు పతాకావిష్కరణ చేశారు. ఈవో పీఆర్‌డీ భార్గవ్, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, సబ్‌ఇంజనీర్ సత్యన్నారాయణ, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



తెనాలి: పతాక వందనం చేస్తున్న సబ్ కలెక్టర్ స్వప్నిల్



కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తుల జెండా వందనం..



ఎన్నారై కళాశాలలో పాల్గొన్న వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



రిపబ్లిక్ డే వేడుకల్లో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తదితరులు



కలెక్టర్ నాగలక్ష్మి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

వాడవాడలా గణతంత్ర వేడుకలు



పొన్నూరు: మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద జాతీయ పతాకానికి వందన సమర్పణ చేస్తున్న కమిషనర్ రమేష్ బాబు తదితరులు

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు-చేబ్రోలు మండలాల్లో ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు వాడవాడలా ఘనంగా జరిగాయి. పొన్నూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జియావుల్ హక్, మున్సిపల్ కార్యాలయంలో, మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అలాగే జై భీమ్ సమూహం ఆధ్వర్యంలో, ఎంపీడీవో కార్యాలయం, అర్బన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో, ఆర్యవైశ్య మహాసభ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో, చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, అన్ని సచివాలయాలు, వడ్లమూడిలోని డీవీసీ హాస్పటల్‌లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు.

పెదకాకాని మండలంలో...

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి)): పెదకాకాని మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పెదకాకాని మండల టీడీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణకాంత్, సిబార్ దంత వైద్య కళాశాలలో డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్, ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగరవేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

లోకల్ టు గ్లోబల్ నినాదంతో ముందుకు..

● ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



సంగం డెయిరీ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): లోకల్ టు గ్లోబల్ నినాదంతో సంగం డెయిరీ దేశ విదేశాల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందించే దిశగా ముందకు సాగుతోందని ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి సంగం డెయిరీ ఆవరణలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తివర్ణ జాతీయ పతాకాన్ని చైర్మన్ నరేంద్ర కుమార్ ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం నరేంద్ర కుమార్ మాట్లాడుతూ డెయిరీ రంగంలో ఏఐ సాంకేతికతను ఉపయోగించుకొని ప్రపంచ స్థాయి డెయిరీలతో పనిచేసేవిధంగా ముందకు సాగాలని అధికారులు, ఉద్యోగులకు సూచించారు. విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా భారతదేశ ఎదగడానికి మనవంతు భాగస్వామ్యం అందించాలని కోరారు. రానున్న రోజుల్లో సంగం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. పాల ఉత్పత్తిదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రత్యేక సాంకేతికతతో యాప్ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండీ పీ.గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మద్యం, మాంసం విక్రయాలు షరా మామూలే..!

తెనాలి అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం రోజు కూడా పట్టణంలో మద్యం, మాంసం విక్రయాలు మామూలుగానే సాగాయి. ఆదివారం కావడంతో పలు చోట్ల బహిరంగంగానే మాంసం, చేపలు విక్రయించారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి కూడా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పలు మద్యం దుకాణాల్లో కూడా ప్రధాన కౌంటర్ల వైపు కాకుండా వెనుక వైపు నుండి మద్యాన్ని విక్రయించారు. కబేళా ఎదుట ఐదారు దుకాణాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా చినరావూరుతోటలో కూడా మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి.



బహిరంగంగా నిర్వహిస్తున్న మాంసం విక్రయాలు

భక్తిశ్రద్ధలతో ఢిల్లీ పోలేశ్వరమ్మ తిరునాళ్ల

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంచాల గ్రామంలోవున్న ఢిల్లీ పోలేశ్వరమ్మ తల్లి తిరునాళ్లను ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు షైలా వెంకటరామరాజు, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, తదితరులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

నివేశన స్థలాలు మంజూరు చేయాలి

పొన్నూరుటౌన్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): భూమిలేని ప్రతి నిరుపేదకు నివేశన స్థలం మంజూరు చేయాలని సీపీఐ అనుబంధ సంస్థ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ గౌస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో సీపీఐ నేతలు నివేశన స్థలాలు అవసరమైన పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుష్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి కుమారి చొప్పవరపు వెంకటరమణ, బుల్లి వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం

పొన్నూరుటౌన్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాక్షి భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో గాయత్రి పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం 24 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలోని పాల్గొన్నారు. ముందుగా గోపూజ నిర్వహించారు. పంచముఖ గాయత్రీ మాత విగ్రహానికి పుష్పాభిషేకం జరిపారు. యజ్ఞ ఆవశ్యకత గురించి పరివార నిర్వాహకులు అవగాహన కల్పించారు. వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెదరావూరుకి చెందిన కొడాలి చంద్రకాంత్ (42) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకని స్వగ్రామం రాగా ఈ నెల 24న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పుడప్పుడు అతడి మానసిక స్థితి సరిగా ఉండదని పరిసర ప్రాంతాల్లో, బంధువుల వద్ద విచారించినా అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పేర్కొన్నారు.